

వికలాంగులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - ఏలూరు

వికలాంగులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించి ఆధార్ నమోదు చేస్తున్నామని గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి రమణ తెలిపారు. స్థానిక తంగెళ్లమూడిలోని మిషనరీస్ అఫ్ ఛారిటీ, మదర్ థెరిస్సా డిజేబుల్డ్ చిల్డ్రన్స్ ఆశ్రమంలో శనివారం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసిన 40 మందికిపైగా వికలాంగులైన చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అమలయ్యేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సహకారంతో వికలాంగులకు ఆధార్ నమోదుకు ప్రత్యేక సంచార ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి, ఆధార్ నమోదుతో పాటు, ఆధార్‌కు మొబైల్ ఫోన్ నెంబర్ లింక్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ జిల్లా కో ఆర్డినేటర్ రవి, సిబ్బంది వెంకటేశ్వరరావు, చైతన్య, ఆశ్రమం ఇన్‌ఛార్జి బ్రదర్ మరియనస్తి థియో, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మావతి పాల్గొన్నారు.

పంచాయతీ ఉపపోరు ప్రశాంతం..!

వైసిపి అభ్యర్థులకు కలిసొచ్చిన సానుభూతి

ఉమ్మడి జిల్లాలో 4 సర్పంచి స్థానాలకు పోలింగ్

3 వైసిపి, ఒకచోట టిడిపి బలపరిచిన అభ్యర్థులు విజయం

31 వార్డుల్లో 17 వైసిపి , 13 టిడిపి, ఒకటి జనసేన సానుభూతిపరుల గెలుపు

ఏలూరు జిల్లాలో 81.71 శాతం, పశ్చిమలో 79.20 శాతం ఓటింగ్



వేము రాజు (అడవినెక్కలం సర్పంచి)

సుగుణబాబు (వణుదుర్రు సర్పంచి)

లక్ష్మణేశ్వరరావు (వీరమ్మకుంట సర్పంచి)

అప్పనస్వామి (కావలిపురం సర్పంచి)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ పంచాయతీ ఉపఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పంచాయతీ సర్పంచి ఎన్నికల పోరులో వైసిపికి సానుభూతి కలిసొచ్చింది. సర్పంచిగా పనిచేస్తూ మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులే పలుచోట్ల బరిలోకి దిగారు. దీంతో రెండు జిల్లాలో నాలుగు సర్పంచి స్థానాలకు ఎన్నికలు జరగ్గా మూడుస్థానాల్లో వైసిపి అభ్యర్థులే గెలిచారు. ఒక స్థానంలో టిడిపి బలపరిచిన అభ్యర్థి విజయంసాధించారు. రెండు జిల్లాల్లో 31 వార్డులకు జరిగిన ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులు అత్యధిక వార్డులను గెలుపొందారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన రెండు జిల్లాలోని పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి ఈనెల ఆరోతేదీన ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. ఏలూరు జిల్లాలో నాలుగు సర్పంచులు, 47 వార్డులకు, పశ్చిమలో మూడు సర్పంచులు, 27 వార్డులకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల ఎనిమిదో తేదీన నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యేసరికి పశ్చిమలోని మూడు సర్పంచి స్థానాలకుగాను యలమంచిలి మండలం దొడ్డిపట్ల, పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం సర్పంచి పదవులు, వివిధ గ్రామాల్లోని 17 వార్డులకు సంబంధించిన పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఏలూరు జిల్లాలో నాలుగు సర్పంచి, 47 వార్డు పదవులకు నోటిఫికేషన్ వెలువడగా ఒక సర్పంచి, 26 వార్డుల పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు శనివారం ఎన్నికలు జరిగాయి.

సర్పంచి పోరులో వైసిపిదే పైచేయి

పంచాయతీ సర్పంచి ఎన్నికల ఉపపోరులో వైసిపి పైచేయి సాధించింది. సర్పంచి పదవిలో ఉండగా మృతిచెందిన నాయకుని కుటుంబంలోని వారే ఎన్నికల బరిలో దిగారు. దీంతో సానుభూతి కలిసివచ్చిందన్న చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో మూడు పంచాయతీల్లో సర్పంచి ఎన్నికలు జరిగాయి. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామ సర్పంచిగా పనిచేసిన చిన్నం అర్జున్‌రావు మృతిచెందడంతో అక్కడ ఉపఎన్నిక జరిగింది. ఆయన సోదరుడు చిన్నం సుగుణబాబును వైసిపి సర్పంచి అభ్యర్థిగా బరిలో దించింది. సానుభూతి పనిచేయడంతో సుగుణబాబు 444 ఓట్ల మెజార్టీతో విజయంసాధించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ సర్పంచిగా పనిచేసిన వేము అబ్రహం మృతిచెందడంతో ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో కుమారుడు వేము రాజును వైసిపి బరిలోకి దించింది. సానుభూతి కలిసిరావడంతో వేము రాజు 323 ఓట్లతో సర్పంచిగా గెలిచారు. నువ్వానేనా అన్నట్లు సాగిన పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మరడాని లక్ష్మణసోమేశ్వరరావు 286 ఓట్లతో గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కావలిపురం పంచాయతీకి సంబంధించి సర్పంచి వనచర్ల వెంకటేశ్వరరావు మృతిచెందడంతో ఉపఎన్నిక జరిగింది. ఇక్కడ వెంకటేశ్వరరావు భార్య వైసిపి నుంచి, తమ్ముడు వనచర్ల అప్పనస్వామి టిడిపి నుంచి పోటీచేశారు. వదిన, మరిది నడుమ హోరాహోరీగా సాగిన పోరులో టిడిపి బలపరిచిన వనచర్ల అప్పనస్వామి 164 ఓట్లతో గెలుపొందారు. ఏలూరు జిల్లాలో 21, పశ్చిమలో పది వార్డు సభ్యులకు ఎన్నికలు జరగ్గా అత్యధిక స్థానాలను వైసిపినే దక్కించుకుంది.

పంచాయతీ వార్డు స్థానాల్లోనూ వైసిపిదే పైచేయి

పశ్చిమలో పదివార్డులు, ఏలూరు జిల్లాలో 21 వార్డులకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పశ్చిమలో ఏడు వార్డుల్లో వైసిపి, మూడుచోట్ల టిడిపి బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. ఏలూరు జిల్లాలో 21వార్డుల్లో ఎన్నికలు జరగ్గా పది చోట్ల వైసిపి, పదిస్థానాల్లో టిడిపి, ఒకస్థానంలో జనసేన సానుభూతిపరులు కైవసం చేసుకున్నారు. రెండు జిల్లాల్లో 31 వార్డుల్లో వైపిసి 17 చోట్ల, టిడిపి 13 స్థానాల్లో, జనసేన ఒకస్థానంలో ఆయా పార్టీల సానుభూతిపరులు గెలుపొందారు.

వీరమ్మకుంటలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య కొంత సేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఎన్నికలు జరిగే గ్రామంలోకి రానీయకుండా టిడిపి నేత, మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి వెళ్లడంతో ఇరుగ్రూపుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పోలైన ఓటింగ్‌శాతం

ఏలూరు జిల్లాలో మొత్తం 10,941 మంది ఓటర్లు ఉండగా శనివారం జరిగిన ఎన్నికల్లో పురుషులు 4392 మంది, మహిళలు 4578 మంది మొత్తం 8,940 మంది మొత్తం 81.71 శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పశ్చిమలో మొత్తం 5,566 మంది ఓటర్లు ఉండగా 4,408 మంది ఓటు వేశారు. ఇందులో 2,100 పురుష ఓటర్లు, 2,308 మంది మహిళా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పెదపాడు మండలం వీరమ్మకుంటలో వైసిపి నేతల సంబరాలు

ప్రశాంతంగా పోలింగ్

భీమడోలు: పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు సభ్యుని ఎంపికకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేసిన పాముల ధనలక్ష్మి 117 ఓట్లు సాధించి పది ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వారి సమీప ప్రత్యర్థి వైసిపి మద్దతుతో పోటీ చేసిన బొద్దాని ప్రసాద్‌కు 107 ఓట్లు వచ్చాయి. వీరితోపాటు జనసేన పార్టీ మద్దతుతో పోటీ చేసిన గారపాటి రాజు 49 ఓట్లు సాధించారు. పది ఓట్లు చెల్లని ఓట్లుగా నమోదయ్యాయి.

ఉంగుటూరు : మండలంలోని కాకర్లమూడి పంచాయతీ 1, 5 వార్డుల ఉప ఎన్నిక శనివారం ప్రశాంతంగా సాగింది. ఒ్టఒ వార్డుకు టిడిపి మద్దతుదారు రాజాని వరలక్ష్మి, వైసిపిహార్డుకు వైకాపా బలపరిచిన తోట దివాకర్, తెదేపా బలపరిచిన బోడే రాజులు పోటీలో ఉన్నారు.1 వార్డులో 113 ఓట్లు, 1 నోటా పోలయ్యాయి. 5 వార్డులో 129 ఓట్లు పోలయ్యాయి. అనంతరం లెక్కింపు నిర్వహించగా ఒకటో వార్డులో రాయి నాగమణి 16 ఓట్లు, 5 వార్డుకు గోడే రాజు 20 ఓట్లుతో విజయం సాధించారు. ఎన్నికయిన అభ్యర్థులకు ధృవపత్రాలు అందించారు. ఇచ్ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఇఒపిఆర్‌డి షేక్ షంషుద్దీన్ ఎన్నికలను పర్యవేక్షించారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల పంచాయతీ ఎనిమిదో వార్డు ఉపఎన్నికలో వైసిపి మద్దతు అభ్యర్థి నడికట్టి సీతారామాంజనేయులు 73 ఓట్ల మెజార్టీతో విజయవం సాధించారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయగా సీతారామాంజనేయులు గెలుపొందారు. మొత్తం 309 ఓట్లకు గాను 244 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నోటా రెండు ఓట్లు, చెల్లనివి 2 ఓట్లు, కుక్కర్ గుర్తు అభ్యర్థికి ఐదు ఓట్లు, గౌను గుర్తు అభ్యర్థికి 83 ఓట్లు, స్టూలు గుర్తు అభ్యర్థికి 156 ఓట్లు వచ్చాయని ఎన్నికల అదికారి తెలిపారు. 78.96 ఓటింగ్ శాతం నమోదైందన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి పంచాయతీ ఆరో వార్డు ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం ఏడు గంటల నుంచి ఒంటిగంట వరకూ పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాన్ని పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు పరిశీలించారు. ఆరో వార్డులో మొత్తం 268 ఓట్లకు గాను 209 ఓట్లు పోలయ్యాయి. వైసిపి మద్దతుదారు మడకం ధర్మరాజు విజయం సాధించారు. ఇతనికి 118 ఓట్లు రాగా సమీప టిడిపి మద్దతుదారు కూరం బొజ్జియ్యకు 74 ఓట్లు వచ్చాయి.

ముసునూరు : మండల కేంద్రం ముసునూరు 11వ వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు కొడవలి వనిత విజయం సాధించారు. కాట్రేనిపాడు పంచాయతీ పదో వార్డులో టిడిపి మద్దతుదారు కాజా రాజ్యలక్ష్మి 78 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

పోలవరం: మండలంలోని చేగొండపల్లి పంచాయతీలో ఆరో వార్డుకు జరిగిన ఉపఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి ఎం.రాజు పది ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

విజేతకు ఆర్ఒ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ జి.శ్రీను ధృవపత్రాన్ని అందజేశారు.

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రు గ్రామ సర్పంచి ఉపఎన్నికల్లో వైసిపి బలపరచిన అభ్యర్థి చిన్నం సుగుణబాబు తన సమీప ప్రత్యర్థి టిడిపి బలపరచిన తోట వెంకటేశ్వరరావుపై 444 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. డిఎస్‌పి శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల సరళిని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి పర్యవేక్షించారు. కౌటింగ్‌ను నూజివీడు డివిజన్ సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు.

ఆగిరిపల్లి: అడవినెక్కలం సర్పంచి ఉపఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వేము రాజు 323 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 1281 ఓట్లు పోలవ్వగా స్వతంత్ర అభ్యర్థి పిల్లి శేషయ్య 148 ఓట్లు, టిడిపి బలపరిచిన అభ్యర్థి పులపాక చిన్నబ్బాయికి 396 ఓట్లు, వైసిపి బలపరిచిన అభ్యర్థి వేము రాజుకు 719 ఓట్లు, నోటాకు ఐదు ఓట్లు, చెల్లని ఓట్లు 13 వచ్చాయి.

కలిదిండి : కలిదిండి పంచాయితీ పరిధిలోని 14వ వార్డుకు జరిగిన ఉపఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి పువ్వుల భోగేశ్వరమ్మ 50 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ ఇద్దరు అభ్యర్థులు పోటీ చేయగా మొత్తం 620 ఓట్లకుగాను 436 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. వాటిలో పెన్నింటి పేరంటాలుకు 193 ఓట్లు, పువ్వుల భోగేశ్వరమ్మకు 243 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు ఆరు, నోటాకు ఒక ఓటు పడినట్లు స్టేజ్ -1 అధికారి జె.శ్రీనివాస్ తెలిపారు.

విద్య ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి : సాబ్జీ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సైకిల్ యాత్ర ప్రారంభం

సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ప్రయివేటీకరణకే మొగ్గు చూపుతున్నాయని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. విద్యారంగ సమస్యలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన రెండు రోజుల సైకిల్‌యాత్రను ఏలూరులోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలో శనివారం ప్రారంభమైంది. ఈ యాత్ర ప్రారంభానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబ్జీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ప్రయివేటీకరణ దిశగా ముందుకుసాగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎన్ఇపి-2020 దేశంలో ఎక్కడా అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. అలాగే బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుని ప్రయివేటీకరణకు అడుగులు వేసిందన్నారు. ఎన్ఇపి-2020 వల్ల జిల్లాలో పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం, హాస్టళ్లకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఈ నష్టాలను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసి వారిని చైతన్య పరిచేందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఈనెల 19, 20 తేదీల్లో ఏలూరు నగరంలో సైకిల్ యాత్రను నిర్వహిస్తుందన్నారు. ఏలూరు నగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ భవన నిర్మాణం కోసం పెద్ద ఎత్తున కృషి చేస్తానని, శాసనమండలిలో విద్యార్థుల సమస్యలు వివరిస్తానని తెలిపారు. అనంతరం జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు మణి, నాయకులు పాల్గొన్నారు.

కౌలురైతులకు పంట రుణాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు

బ్యాంకర్లు కౌలురైతులకు రుణాలు ఇవ్వకుండా మొండిచేయి చూపడం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో కౌలు రైతుల రుణాల సమస్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు. సాగుభూమిలో 70 శాతం పైగా కౌలు రైతులే పంటలు వేస్తున్నారని చెప్పారు. బ్యాంకుల నుండి పంటసాగు నిమిత్తం ఇచ్చే రుణాలు కౌలు రైతులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వరకూ కౌలురైతులున్నారని అయితే సుమారుగా 56 వేల మందికి పంట సాగుదారు హక్కుపత్రాలు మంజూరు చేసినా భూ యజమాని పంట రుణం తీసుకున్నారనే పేరుతో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా బ్యాంకర్ల కమిటీ సమావేశాన్ని తక్షణమే నిర్వహించి కౌలు రైతుల పంట రుణాల మంజూరుపై సమీక్ష చేయాలని కోరారు. జిల్లాలోని కౌలు రైతులందరికీ లక్ష రూపాయల వరకూ వడ్డీ లేని పంట రుణ పథకాన్ని వర్తింపజేసి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ఇవ్వాలి

జిల్లాలో ఉద్యాన పంటల రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించాలని కోరారు. గతంలో అమలుచేసిన డ్రిప్ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

సిఐటియు జిల్లాస్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - నిడమర్రు

కార్మికవర్గం త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మికచట్టాలు, హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ కోరారు. శనివారం సిఐటియు జిల్లా శిక్షణా తరగతులు నిడమర్రు ప్రజాసంఘాల భవనంలో ప్రారంభమైయ్యాయి. ముందుగా సిఐటియు జెండాను జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి అధ్యక్షత వహించగా డిఎన్‌విడి ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి మతోన్మాదాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా దారుణ మారణకాండ జరిగి 150 మంది చనిపోయినా నరేంద్ర మోడీ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. దేశంలో 1శాతం పెట్టుబడిదారుల కోసం దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికవర్గానికి రక్షణగా ఉన్న 44 చట్టాలను కార్పొరేట్స్ కోసం 4 లేబర్ కోడ్లుగా మార్చారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మొదటి రోజు క్లాస్ బోధించారు. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తరగతుల్లో జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, బి.సోమయ్య, యం.నాగమణి పాల్గొన్నారు.

గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంతంలోని 1/59, 1/70 చట్టాల ప్రకారం, పూర్తిస్థాయిలో టైటిల్ రికార్డ్ వెరిఫికేషన్ చేయకుండా, ఏకపక్షంగా గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులు తీరును సిపిఎం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా శనివారం సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం, మర్లగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 39, 20, 40, 41, 42లో మొత్తం 4000 ఎకరాల భూమిలో రెవెన్యూ రికార్డులను 1933 ఆర్ఎస్ఆర్ లోసరిపెల్లి రామన్న, కలికొండ సూర్యనారాయణ, వెంకన్న ఉన్నారని, ప్రస్తుతం అడంగల్‌లోని పోల్నాటి బండారి కుటుంబాలు ఏరకంగా రికార్డులో నమోదు చేయబడ్డాయో స్పష్టంగా చెప్పాలని పేర్కొన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలోని 1/70 చట్టాన్ని యథేచ్ఛగా రెవెన్యూ అధికారులు దిక్కరిస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలకనుగుణంగానే టైటిల్ వెరిఫికేషన్ చేస్తే భూములు ఎవరివి అన్నది తేలుతుందని వారు తెలిపారు. రికార్డులు ఏమి చూడకుండా గిరిజనేతర పేరుతో రెవెన్యూ రికార్డులు నమోదు చేయడానికి ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తక్షణమే సమగ్రంగా రికార్డు వెరిఫికేషన్ చేయాలని కోరారు.

శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలల్లో అవగాహన కల్పించాలని ఉమ్మడి జిల్లా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అధాలత్ ఛైర్మన్ ఎ.మేరిగ్రేసి కుమారి తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార భవనంలో జిల్లా ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వతలోక్ అదాలత్ గురించి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరిగ్రేసికుమారి మాట్లాడుతూ జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అధాలత్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సేవలపై ప్రతి శాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తి మాట్లాడుతూ రెవెన్యూపరంగా సమస్యలుంటే మండలాల్లోని తహశీల్దార్ల ద్వారా సమస్య పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు కె.చంద్రశేఖర్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ బాపిరాజు, ఎల్‌డిఎం నీలాద్రి, వివిధ బ్యాంకు, హౌసింగ్, ఆర్‌టిసి, ఎడ్యుకేషన్, డ్వామా, బిఎస్ఎన్ఎల్ తదితర శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నాన్ ప్రొవిన్షియలైజ్డ్ పెన్షనర్స్‌కు సంబంధించిన 2010 పిఆర్‌సి, 2015 పిఆర్‌సి అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న డిఎలు అన్నీ కలిపి పెన్షన్ రివైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.రవి కుమార్‌ను కలిశారు. 2023 మార్చి 31 వ తేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించిన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సిఇఒ మాట్లాడుతూ ఆ తీర్మానం మేరకు 2010 పిఆర్‌సి, 2015 పిఆర్‌సి, పెండింగ్‌లో ఉన్న డిఎలు అన్నీ కలిపి చెల్లించుట విషయమై ప్రీ ఆడిట్ నిమిత్తం లోకల్ ఆడిట్ ఫండ్ డిపార్ట్‌మెంట్‌కు పంపామని తెలియజేశారు. సంబంధిత ఉత్తర్వులను అందజేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న జిల్లా పరిషత్ పాలకవర్గాన్ని, సిఇఒను ఈ సందర్భంగా ఎంఎల్‌సి అభినందించారు.

ఇదేనా.. సంక్షేమం రక్షణ



సంక్షేమమే తమ ప్రభుత్వ ఊపిరి అని అర్హులందరికీ పథకాలను అందించడమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న వైసిపి ప్రభుత్వం, బటన్ నొక్కినా ఖాతాల్లోకి సొమ్మురాకపోవడంతో లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న రాష్ట్రప్రభుత్వం వాటి అమలులో అనేక జిమ్మిక్కులు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. నిబంధనల సాకుతో లబ్ధిదారుల కుదింపు, అర్హులకు సైతం రకరకాల కారణాలతో పథకాలను దూరం చేయడం వంటివన్నీ పాత అంశాలు. తాజాగా అమ్మఒడి దగ్గర నుంచి సున్నా వడ్డీ వరకూ అన్నింటా సిఎం జగన్ బటన్ నొక్కినా లబ్ధిదారులకు సొమ్ము జమకాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

రెండు జిల్లాల్లో అమ్మఒడి సొమ్ము ఇప్పటికీ జమ కానివారు సుమారు 15 శాతం వరకూ ఉండగా అరకొర సొమ్ము జమ అయినవారు 50 శాతం మంది ఉన్నారు. ఈ పథకాల అమలులో జగన్ బటన్ నొక్కిన రెండు మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేది. అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. ప్రధానంగా అమ్మఒడి లబ్ధిదారులను పరిశీలిస్తే అసలు సొమ్ము జమ కానివారికి సంబంధించి అధికారులు రకరకాల సాకులు చెప్పి సర్దిచెబుతున్నారు. అరకొర సొమ్ము జమయినవారికి మాత్రం త్వరలోనే మిగిలిన సొమ్ము జమవుతుందంటూ చెబుతున్నప్పటికీ లబ్ధిదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటంతో ఏం చెప్పాలో తెలియక అంతా తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేషన్ ద్వారా సొమ్ము జమచేస్తుండటమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల కష్టాలు పరిగణలోకి తీసుకోకుండా ఆర్భాటపు ప్రచారాన్ని కొనసాగించడంపై అంతా పెదవి విరుస్తున్నారు. డ్వాక్రా మహిళల రుణమాఫీ సొమ్ము జమ విషయంలోనూ సుమారు రెండు, మూడు నెలలు తంతు నడిపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సున్నా వడ్డీ సొమ్ము జమ ఎప్పటికీ పూర్తవుతుందోనని అంతా చర్చిస్తున్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణమూ లబ్ధిదారులకు సవాలక్ష కష్టాలను తెచ్చిపెట్టింది. ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదిస్థాయి వరకే సరిపోతుండటం, నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడం, ఇసుక సమస్య వెంటాడుతుండడం తదితర అంశాలు లబ్ధిదారులకు తలనొప్పిగా పరిణమించాయి. అదే సమయంలో వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం పూర్తవ్వగానే ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు సకాలంలో సొమ్ము జమ చేయకపోవడం లబ్ధిదారులను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తుంది. ఫలితంగా జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో పడకేసిందని చెప్పొచ్చు. వైసిపి చెబుతున్న సంక్షేమం, అందరికీ ఇల్లు పథకం అంతంతమాత్రంగా అమలు కావడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా అధికార పార్టీ పెద్దలు ప్రచార ఆర్భాటం మాని పథకాలను పూర్తిస్థాయిలో సకాలంలో అమలు చేయడం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటే ఈ ప్రభుత్వం ఊపిరి నిలబడుతుందని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో పరిస్థితులు తారుమారయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

మహిళల రక్షణ, మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న పాలకులు వారి కోసం తీసుకొచ్చిన చట్టాల అమల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఫలితంగా చోటు చేసుకుంటున్న దారుణాలు ఉమ్మడి జిల్లాలోనూ సాక్షాత్కరిస్తున్నాయి. దీనికి ఇటీవల కాలంలో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, అలాగే ఏలూరు జిల్లా మండవల్లి, ముసునూరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న దారుణాలే నిదర్శనంగా చెప్పొచ్చు. మహిళల రక్షణ కోసం దిశా చట్టం, యాప్ తీసుకొచ్చామని అర్భాటం చేస్తున్న ప్రభుత్వం అధికార యంత్రాంగం వరుస సంఘటనలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆకివీడు పట్టణంలో శనివారం ఉదయం పట్టపగలు గుడికి వెళ్లిన మహిళను భర్త అత్యంత కిరాతకంగా పొడిచి చంపడమే కాక ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'మీ కూతుర్ని చంపేశాను వెళ్లి చూసుకోండి' అని చెప్పడం జడలు విప్పిన రాక్షసత్వానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మండవల్లిలో హాస్టల్‌లో విద్యార్థినిపై వరుసకు సోదరుడు, మరో ఇద్దరు ఆకృత్యానికి పాల్పడి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడం చట్టాలంటే మృగాళ్లకు ఏ పాటి భయముందో తేటతెల్లం చేస్తుంది. ప్రభుత్వాలు, అధికారులు ఉన్నచట్టాలైనా కఠినంగా అమలు చేయడంతో పాటు హింసను ప్రేరేపించే మాధ్యమాలు సంస్కృతిని అరికట్టడమే లక్ష్యంగా ముందుకుసాగితే ఎంతోకొంత మహిళలకు రక్షణ లభించే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నిర్భయ, దిశ చట్టాల పేరు చెప్పుకుని గొప్పలు చెప్పుకోవడంమాని దారుణ ఘటనలు జరిగినప్పుడు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళల రక్షణకు అవసరమైన మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇటీవల జిల్లా కేంద్రం ఏలూరులో చోటు చేసుకున్న ఘటన చెప్పకనే చెబుతోంది. ఇంటి యజమాని ఊరెళ్లగా ఇంట్లో ఉన్న భార్య, కుమార్తె అర్ధరాత్రి ఎవరో తలుపు తడుతున్నారంటూ భయాందోళనకు గురి కావడం స్థానికులు, పోలీసులు వెళ్లినా తలుపులు తీయకపోవడం సమాజంలో ఉన్న రక్షణపై మహిళలకు ఏపాటి నమ్మకం ఉందో తెలియజేస్తోంది. ఈ వరుస సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పాలకులు, అధికారులు అటు విద్యాసంస్థల్లో ఇటు ఇతర వేదికల్లో మహిళలకు చట్టాలు, రక్షణపై అవగాహన కల్పించడంతో పాటు ఆ చట్టాల అమలుకు కఠిన చర్యలు చేపట్టాలని పరిశీలకులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో సచివాలయాల్లో మహిళ సంరక్షణ కార్యదర్శుల నియామకం లక్ష్యం నెరవేరదని గంటాపథంగా చెబుతున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఆపన్నులను ఆదుకోవడమే 'మానవత' లక్ష్యం

22న ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

మానవతా విలువలే ప్రధానంగా మానవతా స్వచ్ఛంద సంస్థ నడుస్తుందని చింతలపూడి మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ తెలిపారు. చింతలపూడిలో పాత బస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకూ విజేత కళాశాల విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థ అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. ముఖ్యంగా శాంతి రథం, ఫ్రెజర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈనెల 22వ తేదీన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో మానవత కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి తహశీల్దార్ బి.కృష్ణ జ్యోతి, విజేత జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.శేషగిరిరావు, మానవత చైర్మన్ ఎ.అప్పారావు, అధ్యక్షులు కన్వీనర్ కె.గాంధీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎ.రాజారావు, కమిటీ సభ్యులు కె.రాంబాబు, ఎన్.అశోక్ బాబు, ఎం.సత్యనారాయణ, కె.సురేంద్ర బాబు, పి.కిషోర్, ఎం.అజయ్ కుమార్, విజేత జూనియర్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీశాఖ ప్లాంటేషన్‌లను పరిశీలిస్తున్న అటవీశాఖ రేంజ్ అధికారులు

ప్లాంటేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన కొత్త ప్లాంటేషన్‌లను విశాఖపట్నం నుంచి వచ్చిన అటవీశాఖ ప్రత్యేక బృందం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని చంద్రమ్మ కాలనీ, కామయ్యపాలెంలో గత సంవత్సరంలో నాటిన మారు జాతి మొక్కల ప్లాంటేషన్‌లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంటేషన్‌లో సంవత్సర కాలం నాటికే మొక్కలు సజావుగా పెరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా పలు రకాల మొక్కలకు కావాల్సిన పోషకాలు సరైన సమయంలో అందిస్తే త్వరగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ అటవీ శాఖ రేంజ్ అధికారి గంగారాజు, జంగారెడ్డి గూడెం అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీవాణి, ఎఫ్‌బిఒ కిరణ్, ఎఫ్‌ఆర్‌ఒ శ్రీనివాస్, ఎఫ్‌బిఒ మరేష్, పోసి పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో టిడిపి నేతలు

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్రాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కోసం వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. టిడిపి నాయకులు గనిశెట్టి మోహన్ కుమార్ నివాసంలో టిడిపి కార్యకర్తలతో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒంటెద్దు పోకడను తలపిస్తుందన్నారు. ఆనాటి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజలే దేవుళ్లని సంబోధించి ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. అలాగే మరో మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పరితపించారన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషిచేసి జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు తాడినాడబాబు, యార్లగడ్డ రవి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, కొల్లు వరప్రసాద్, చలపతి ప్రసాద్, గనిశెట్టి శ్రీరామ్, హరి గల వెంకటేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

31 మందిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అల్లంచర్ల అడవిలోకి అక్రమంగా ప్రవేశించి కలప నరకడమే కాకుండా, ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన 31 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అల్లంచర్ల అడవిలోకి ఈనెల 17న కామవరపుకోట మండలం జీలకర్ర గూడెం గ్రామానికి చెందిన 31 మంది వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి, అడవిని నరుకుచుండగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.రాజు తన సిబ్బందితో కలిసి వెళ్లి ఆపడానికి ప్రయత్నించారు. ఫారెస్ట్ అధికారుల మాట వినకుండా విధులకు ఆటంకం కలిగించారని, కలప అక్రమ రవాణా చేస్తున్నట్లు బీట్ ఆఫీసర్ బి.రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - మండవల్లి

గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం రాత్రి మండవల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండవల్లి నుంచి మూడు తాళ్లపాడు గ్రామం వెళ్లే రహదారిలో ఉన్న రైల్వే గేటు దగ్గర శుక్రవారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో రైలు వెళ్లేందుకు గేట్ మెన్ గేటు వేశాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ పైకి వెళ్ళాడు. దీంతో అటుగా వస్తున్న రైలు ఆ వ్యక్తిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆ వ్యక్తి అవయవాలు ముక్కలు ముక్కలుగా తెగిపడ్డాయి. సమాచారం అందుకున్న గేట్ మెన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. రైల్వే పోలీసులు శనివారం మండవల్లి చేరుకుని మృతదేహాన్ని గుడివాడ తరలించారు. ఈ ప్రమాదంపై గుడివాడ రైల్వే ఎస్ఐ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు.

ఇంటిని దహనం చేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని దిగవల్లి గ్రామంలో తమ్ముడు బాలస్వామి ఇంటిని కొందరు వ్యక్తులు శనివారం దహనం చేసినట్లు బాలస్వామి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. అనుమానితుల పేర్లు ఇచ్చారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - ముసునూరు

చిల్లబోయినపల్లి గ్రామంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త తన భార్యని ఇనుపరాడ్డుతో కొట్టి చంపిన హత్య కేసులో ముద్దాయిని అరెస్టు చేయాలని ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రతిష్టాత్మకంగా తెలిపారు. నూజివీడు డిఎస్‌పి పర్యవేక్షణలో నూజివీడు రూరల్ సర్కిల్ సిఐ అంకబాబు ఆధ్వర్యంలో ముసునూరు ఎస్ఐ యం.కుటుంబరావు, వారి సిబ్బంది సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చాకచక్యముగా పట్టుకొని అరెస్టు చేశారు. సిఐ, ఎస్ఐలను, వారి సిబ్బందిని నూజివీడు డిఎస్‌పి ఇ.అశోక్ కుమార్ గౌడ్ అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా జీతాలు, ఉద్యోగాలకు రాబోతున్న ప్రమాదాన్ని తిప్పి కొట్టాలని జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ తెలిపారు. మండల గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశం ఎస్‌కె ఇస్మాయిల్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, తదితర పథకాల అమలుకై ప్రభుత్వం జారీ చేసిన 132, 680 జిఒలు, టెండర్లు లేకుండా ఉద్యోగాల్లో కొనసాగించాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు పట్ల, హామీలు అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర మాట్లాడుతూ తరతరాలుగా గ్రామపంచాయతీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కార్మికులకు హక్కులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శక్తిధోయిన రాంబాబు మాట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్ జీతాలు వెంటనే కార్మికులకు చెల్లించాలని, లేని ఎడల పంచాయతీ కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రంపేట, గవరవరం, పరింపూడి, సరిపెల్లి, తిప్పగాయలపాడు, కన్నాపురం, బోడిగూడెం, బయ్యనిగూడెం, రాజవరం, వేదాంతపురం, నరసన్నపాలెం, సీతంపేట గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ

నేడు నూజివీడులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని టౌన్ సబ్ స్టేషన్, ట్రిపుల్ ఐటీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ సత్యనారాయణ తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

23న ట్రిపుల్ ఐటీలో మూడో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్లు భర్తీకి ఈనెల 23వ తేదీన మూడవ విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కౌన్సిలింగ్‌కు ఎంపిక జాబితాలోని అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో సకాలంలో హాజరవ్వాలని కోరారు.

పురుగులతో కూడిన ప్రసాదం

గోకుల పారిజాత గిరి ప్రసాదంలో పురుగులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విక్రయించే ప్రసాదంలో పురుగులు కనబడుతున్నాయని యాత్రికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఆలయానికి వచ్చిన యాత్రికులు పులిహోర ప్యాకెట్లో పురుగులను గుర్తించిన చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రచార మాధ్యమాలలో హల్చల్ చేసిన ఈ సంఘటనపై ఆలయ కార్యనిర్వహణ అధికారి మాణిక్యాల రాంబాబును వివరణ అడగగా తాము కూడా ప్రచార మాధ్యమాలలో చూసామని తెలిపారు. యాత్రికులు ఎవరూ ఆలయ సిబ్బందికి, తనకు ఏ విధమైన ఫిర్యాదు చేయలేదన్నారు. విద్యుత్ దీపాల వెలుతురుకు ఎగిరి వచ్చే రెక్కల పురుగులు మాదిరిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రసాదాల ప్యాకింగ్‌లో మరింత జాగ్రత్త వహిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయురాలి మృతిపై విచారణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నిర్మల ఆసుపత్రిలో గతంలో ఉపాధ్యాయురాలు మృతిపై అందిన ఫిర్యాదు మేరకు వైద్యాధికారులు విచారణ నిర్వహించారు. శనివారం విచారణాధికారి డాక్టర్ సికిందర్ మోహన్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ రాజీవ్, ఎఒ మురళీకృష్ణలు నిర్మల ఆస్పత్రి వైద్యులు అందించిన వైద్యంపై విచారించారు. 2023 మే 4వ తేదీన కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంకు చెందిన ఉపాధ్యాయురాలు టి.కృపామాలిని అనారోగ్యంతో నిర్మల ఆసుపత్రిలో చేరారు. వైద్యం పొందుతూ మరో ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆమె మతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి భర్త దుర్గారావు ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యం కారణంగానే తన భార్య మృతి చెందిందని వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు వైద్యం అందించిన వైద్యులను విచారణ జరిపినట్లు విచారణాధికారి సికిందర్ మోహన్ తెలిపారు.

ముదినేపల్లిలో ఈదురుగాలల వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో శనివారం భీకర గాలితో కూడిన వర్షం కురిసింది. ఉదయం 6 గంటలకు మొదలైన వాన 10 గంటల వరకూ పడుతూనే ఉంది. మూడు గంటల విరామం అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ మొదలై, రెండు గంటల పాటు భీకర వర్షం కురిసింది. కురిసిన ఈ వర్షానికి ముదినేపల్లితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమైయ్యాయి. రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్డు కనబడక వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడ్డారు. భారీగా కురిసిన ఈ వర్షం ఖరీఫ్, వరిపైరుకు మంచి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డాగురే సేవలను నిత్యం స్మరించుకోవాలి..

ఫొటోగ్రఫీ డే సందర్భంగా నివాళి

ప్రజాశక్తి - భీమడోలు

ఫొటోగ్రఫీ సృష్టికర్త డాగ్యురే సేవలను ఫొటోగ్రాఫర్లు నిత్యం స్మరించుకోవాలని భీమడోలు సర్కిల్ ఏరియా ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు, ఎ.రంగారావు కోరారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో శనివారం సంతపేట ఏరియాలోని డాగ్యురే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వేదిక వద్ద సంఘ అధ్యక్షులు డి.శ్రీరామ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు ఐక్యతగా మెలిగి సంఘ అభివృద్ధికి, ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సంఘ సభ్యులు కెమెరా సృష్టికర్త డాగ్యురేతో పాటు మిస్సైల్ మాన్‌గా గుర్తింపు పొందిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కోశాధికారి పి.రామ్మూర్తి, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


డాగ్యురేకు నివాళులర్పిస్తున్న సర్కిల్ ఏరియా ఫొటోగ్రాఫర్ల సంఘ సభ్యులు

మహనీయుడు జ్యోతీరావు పూలే

ఘనంగా 196వ జయంతి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యావ్యాప్తికి ముఖ్యంగా మహిళా విద్యకు కృషిచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయం అని పలువురు వక్తలు తెలిపారు. గుండుగొలనులో శనివారం జ్యోతిరావు పూలే 196వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి తుమ్మగుంట భవానీ రంగా, సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షురాలు సునీత మాన్సింగ్, ఎంపిపి కె.రామయ్య, గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు, వైసిపి గ్రామ సచివాలయాల కన్వీనర్ జి.మురళి, ఎంపిటిసి ముళ్లగిరి జాన్సన్, వైసిపి ప్రముఖులు వి.అచ్యుతరామయ్య, రావిపాటి సత్య శ్రీనివాస్, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు.


పూలేకు నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

గుండుగొలను పిహెచ్‌సిలో టీకాలు పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఆశా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలను సిబ్బంది వేస్తున్న తీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి ద్వారా వివిధ రూపాల్లో లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఎమ్ఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులు గోల్ఫ్ కార్ట్ ఎలక్ట్రిక్ వాహన ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు క్యాంపస్‌లోని నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల ఇసిఇ, ఇఇఇ, మెకానికల్ ఆఖరి సంవత్సర విద్యార్థులు తమ నూతన ఆవిష్కరణగా ఎలక్ట్రికల్ గోల్ఫ్ కార్ట్ అనే ఎలక్ట్రికల్ వాహనాన్ని రూపొందించారు. 48 వోల్టుల విద్యుత్తును అందించే నాలుగు బ్యాటరీల సహాయంతో నడుస్తుంది. ఈ విభాగంలో ఇది ప్రాథమిక దశ వాహనం మాత్రమే. ఇది సుమారు 20 నుంచి 25 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. ఈ వాహనాన్ని ఇంజనీరింగ్ మూడు విభాగాలకు చెందిన 154 మంది విద్యార్థులు 30 రోజుల కాలంలో దీనిని రూపొందించారు. ఇసిఇ, ఇఇఇ, మెకానికల్ విభాగాధిపతుల నేతృత్వంలో సైస్కిల్ అకాడమీకు చెందిన ట్రైనర్లు సంజయ్ కుమార్, సిద్ధాంత, అమిత్, వీరారెడ్డి శిక్షణలో విద్యార్థులు దీనిని రూపొందించారు. బ్యాటరీలు పూర్తిగా రీఛార్జి అయితే 60 నుంచి 70 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించగలదు. అవసరం మేరకు దీని సామర్థ్యాన్ని పెంచి బయట కూడా ఎక్కువ దూరం, వేగంతో నడిపే విధంగా కంట్రోల్స్‌ను మార్చుకోవడం ద్వారా తయారు చేసుకోవచ్చని ట్రైనర్లు తెలిపారు.

విద్యార్థులు రూపొందించిన గోల్ఫ్ కార్ట్ ఎలక్ట్రికల్ వాహనం

బకాయి జీతాలు చెల్లించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి సేద్యం సిబ్బందికి జీతాల బకాయిలను చెల్లించాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రకృతి సేద్యం అభివృద్ధి కోసం పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలలకి ఒకసారి కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి ప్రకృతి సాగు ప్రోత్సాహకానికి ప్రత్యేక నిధులు విడుదల అవుతున్నా, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడం వలన సిబ్బందికి జీతాల సమస్య తలెత్తుతుందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 450 మంది సిబ్బంది వివిధ హోదాలలో పని చేస్తున్నారని తెలిపారు. వీరికి ప్రస్తుతం రూ.44 లక్షల వరకూ బకాయిలు ఉన్నాయన్నారు. ఉద్యోగులు సకాలంలో జీతాలు అందక రుణాలు చేసుకుంటూ, ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయి పడ్డ 6 నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలోనే గుర్తుకురావడం బాధాకరం

ప్రజాశక్తి - మండవల్లి

ఎన్నికల సమయాలలోనే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిఎంసి బాలయోగి భవనాల నిర్మాణం, కొల్లేరు సరస్సులో రెగ్యులేటర్ కాంటూరు కుదింపు గుర్తుకు రావడం బాధాకరమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్ భాస్కరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఓట్ల కోసం రాజకీయం చేయడం సరికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిఎంసి బాలయోగిల పేరిట సుమారు పదహారేళ్ల కిందట భవనాలు నిర్మించే విధంగా స్థలాలను కేటాయించినప్పటికీ నేటికీ భవనాలు నిర్మించేలా రాజకీయ నాయకులు శ్రద్ధ చూపకపోవడం దారుణం అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, రాజకీయ నాయకులు, దళిత సంఘాల నాయకులు పార్టీలను పక్కనపెట్టి భవనాలు నిర్మించే విధంగా ప్రజా ప్రతినిధులపై, అధికారులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను ప్రారంభించి, భవనాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వసంస్థల ప్రయివేటీకరణ ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఉపసంహరించుకుని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. శనివారం 'రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత, బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను స్థానిక సిపిఐ మండల సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజకీయ వ్యవస్థలో మతోన్మాదాన్ని, దుష్ట సంప్రదాయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచేస్తూ, సామాన్యులను అప్పులు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జెవి రమణరాజు, మండల కమిటీ సభ్యులు తాళ్లూరు నాగరాజు, చిలంతరాజుల శ్రీను, దొంతు రాంపండు, హనుమంతు, సీనయ్య, డి.రామబ్రహ్మం పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

వాటర్ ప్లాంట్లు ప్రారంభిస్తున్న దేవస్థానం కమిటీ సభ్యులు, దివీస్ ప్రతినిధులు

రూ.1.20 కోట్లతో ఆర్ఒ వాటర్ ప్లాంట్లు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో, భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రదేశాలలో రూ.కోటి 20 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్లు శనివారం ప్రారంభించారు. సెంట్రల్ పార్కింగ్, కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రం, కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం, అన్న ప్రసాద కేంద్రం, శివాలయం, 120 రూమ్స్‌లో దివిస్ లేబరేటరీ వారు సిఎస్ఆర్ నిధులతో ఏడు చోట్ల ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను దేవస్థానం ఇఒ వెంద్రా త్రినాధరావు, ఇఇడివి భాస్కర్, ట్రస్టు బోర్డ్ మెంబర్స్‌తో కలిసి ప్రాంభించారు. దివీస్ లేబోరేటరీ ప్రతినిధులు సిహెచ్ శ్రీనివాసరావు, నగేష్ పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు పొందాలి

ఆర్‌డిఒ ఝాన్సీరాణి

ప్రజాశక్తి - టి.నరసాపురం

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి సూచించారు. మండలంలోని బొర్రంపాలెం సచివాలయం-1ను శనివారం సందర్శించిన ఆమె ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ బిఎల్ఒలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లు వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించి, మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి సుబ్బారావు, పంచాయతీల విస్తరణ అధికారి రామకృష్ణ, విఆర్ఒ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని జిల్లా పరిషత్ ఎస్ఆర్ఆర్ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీకాంత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో చేరే వారి గురించి వాలంటీర్ల ద్వారా వివరాలను సేకరించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌ని కలిసి మాట్లాడారు. రెండు పాఠశాలను పూర్తిగా తనిఖీ చేశారు.

పాఠశాలలో డ్రాపవుట్లపై దృష్టి పెట్టాలి

డిడి రామ్మోహన్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పాఠశాలల్లో డ్రాపౌట్స్ విద్యార్థులపై దృష్టి పెట్టాలని నూజివీడు మండల ప్రత్యేక అధికారి, ఏలూరు జిల్లా ఉద్యానశాఖ డిడి రామ్మోహన్ తెలిపారు. శనివారం మండలంలోని పలు శాఖల అధికారులతో ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు మండల పరిధిలోని డ్రా పౌట్స్ 400 మందికి పైగా ఉన్నారని, ప్రస్తుతం ఆ సంఖ్య 200కు తగ్గిందన్నారు. ఈ సంఖ్యను పూర్తిగా సున్నా చేయాలని డివైఇఒ సేవ్య నాయక్, ఎంఇఒ-2 జమలయ్యలకు వారు సూచించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి
రాజమహేంద్రవరం
Crl. M.P.No. 500/2022
Crl. R.P.No. 3484/2022
బిట్వీన్:
ముళ్ళపూడి చంద్రమౌళి ప్రసాద్, తండ్రి: వీరన్న చౌదరి, హిందు, వయస్సు 43 సం॥లు, రఘుదేవపురం, సీతానగరం మండలం, తూ॥గో॥జిల్లా. ...పిటీషనరు
మరియు
మేరుగు నాగార్జున, తండ్రి: లక్ష్మయ్య, హిందు, వయస్సు 48 సం॥లు, డో.నెం. 10-101, శత్రువాహన నగర్, 4వ రోడ్డు, 4-ఎ1, ఏలూరు, ప॥గో॥జిల్లా.
...రెస్పాండెంటు
పై నెంబరు క్రిమినల్ రివిజన్ పిటీషను దాఖలు చేయుటలో జరిగిన ఆలస్యము 77 రోజులను రద్దుపరచవలసినదిగా కోరుచూ పై పిటీషను పిటీషనరు దాఖలు చేసియున్నారు. పై పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టులు ద్వారాను ఎన్నిసార్లు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన మహారాజశ్రీ కోర్టు వారు మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసు పంపమని ఆర్డరు వేసినారు. మీరు ది.31-08-2023వ తేదీన పై చెప్పబడిన శ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు అయి మీ అభ్యంతరములు తెలియపరచవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షములో విచారణ జరుపగలరు.
APPALA SUBRAMANYAM
Advocate, Seetampeta,
Rajahmundry. Cell: 93930 36723

ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC)పోయినది
POTHURAJU KUMARI అను నాకు KUWAIT రాయబార కార్యాలయం అధికారులు ది.11-06-2013న X0988857 నెంబరుగల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. ది. 10-8-2023 పెద అమిరం గ్రామం నుండి నరసాపురం పట్టణం చినమామిడిపల్లిలోని మా అమ్మగారి ఇంటికి వెళ్ళిన సందర్భంలో సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు మెయిన్ రోడ్‌కు వెళ్ళినపుడు నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ EC ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అదించగలరని కోరుతున్నాను
POTHURAJU KUMARI
W/o. Pothuraju Anil Kumar
D.No. 6-173, Colony Pedamiram
Kalla Mandal
West Godavari Dist, A.P.